

ప్రారంభానికి నోచుకోని రాష్ట్ర ఆహార పరీక్షల ప్రయోగశాల

ప్రారంభానికి ముందే ఇలా..!

- భూత్ బంగ్లాలా రాష్ట్ర ఆహార పరీక్షల ప్రయోగశాల
- బీటలు వారుతున్న భవనం గోడలు
- అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా ప్రాంగణం
- ఎక్కడ చూసినా మద్యం బాటిళ్ల దర్శనం
- వృథాగా కోట్ల రూపాయల ప్రజాధనం

బీచ్‌రోడ్డు: కోట్ల రూపాయలు ఖర్చు చేసి, నిర్మించిన రాష్ట్ర ఆహార పరీక్షల ప్రయోగశాల భవనం భూత్ బంగ్లాను తలపిస్తోంది. ప్రారంభం కాక ముందే శిథిలావస్థకు చేరుతోంది. దీంతో అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారుతోంది. ప్రాంగణంలో ఎక్కడ చూసినా మద్యం సీసాలే దర్శనమిస్తున్నాయి. ఇప్పటికే సరైన శుభ్రత లేక అస్తవ్యస్తంగా కనిపిస్తున్న కార్యాలయం మందుబాబుల నిర్వాకంతో మరింత అధ్వానంగా మారింది. ఈ కార్యాలయం ప్రాంగణంలోనే ప్రాంతీయ ఆహార పరీక్ష కేంద్రం, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోల్ కార్యాలయం ఉన్నాయి. అయినా సరే విచ్చలవిడిగా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతూనే ఉన్నాయి.

2007లో భవన నిర్మాణం ప్రారంభం

పెదవాల్తేరులోని ప్రాంతీయ ఆహార ప్రయోగశాల శిథిలం అవుతున్న నేపథ్యంలో, అదే ప్రాంగణంలో 2007లో నూతన భవనం నిర్మాణం ప్రారంభమైంది. రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్‌కు రాష్ట్ర ఆహార పరీక్షల ప్రయోగశాల లేకపోవటంతో ఈ భవనాన్ని రాష్ట్ర ప్రయోగశాలగా గత ప్రభుత్వం నిర్మాణం పూర్తి చేసింది. గత ఏడాది ఫిబ్రవరిలో ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. అయితే సిబ్బంది లేక సేవలను ప్రారంభించలేదు. ఈ భవనంలో సేవలను ప్రారంభించకపోవటంతో కోట్ల రూపాయల యంత్రాలు, రసాయనాలు నిరుపయోగంగా పడి ఉన్నాయి. మరోవైపు భవనం గోడలు పగుళ్లు ఇవ్వడంతో పాటు, గోడలపై పిచ్చి మొక్కలు పెరుగుతున్నాయి.

పోలీసులకు ఫిర్యాదు ఇచ్చినా..

ప్రాంగణంలో రాత్రి సమయంలో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. కానీ, గంజాయి వినియోగం, మందుబాబుల ఆగడాలు తగ్గటం లేదని వాపోతున్నారు. కార్యాలయాల నిర్వహణకు కూడా సరిపడే సిబ్బంది లేకపోవటంతో ప్రాంగణం అశుభ్రంగా మారుతోంది.

ముఖద్వారం నుంచే మొదలు..

ఫుడ్ కంట్రోల్ కార్యాలయ ప్రాంగణంలో అసాంఘిక కార్యక్రమాలు ఏ స్థాయిలో జరుగుతున్నాయంటే కార్యాలయం ముఖద్వారం వద్దే పదుల సంఖ్యలో మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. ఇక లోపలికి వెళ్తే ఎక్కడ చూసినా మద్యం సీసాలే కనిపిస్తున్నాయి. అయితే, వీటిని కార్యాలయంలో పని చేస్తున్న సిబ్బంది సేవించి పడేస్తున్నారా.. లేక రాత్రి సమయంలో బయట వ్యక్తులు లోపలికి వచ్చి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారా అనేది తెలియాల్సి ఉంది.



కార్యాలయం ప్రాంగణంలో దర్శనమిస్తున్న మద్యం సీసాలు

'స్వచ్ఛ దివస్' ఎక్కడ?

గత శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన స్వచ్ఛాంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ఈ కార్యాలయం వద్ద నిర్వహించారా అనే సందేహం ఈ కార్యాలయాల ప్రాంగణాన్ని చూస్తే కలగకమానదు. స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో నిర్వహించాలి. ఆరోజు కార్యాలయ ప్రాంగణాలను శుభ్రం చేయాలి. కానీ, ఈ కార్యాలయాల్లో అటువంటి కార్యక్రమం నిర్వహించినట్లు కనిపించడం లేదు. దానికి నిదర్శనం నేటికీ ప్రాంగణం మొత్తం దర్శనమిస్తున్న మద్యం సీసాలు, గుట్కా ప్యాకెట్లు, రసాయనాలే. అధికారులు ఇప్పటికైనా స్పందించి, భవనం ప్రారంభం, నిర్వహణ విషయంలో శ్రద్ధ కనబరచాలని పరిసర ప్రాంతాల వారు కోరుతున్నారు.



రాష్ట్ర ఆహార ప్రయోగశాల భవనం గోడల నుంచి పుట్టుకొస్తున్న పిచ్చిమొక్కలు



పగుళ్లిస్తున్న నూతన భవనం

క్లుప్తంగా

ద్వారకా జోన్ ఏసీపీకి సత్కారం



ఏసీపీ నరసింహమూర్తిని సత్కరిస్తున్న దృశ్యం

ఎంవీపీకాలనీ: విశాఖ ద్వారకా జోన్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తిని వైఎస్సార్‌సీపీ నాయకులు బోని శివరామకృష్ణ, దేవరకొండ మార్కండేయులు సోమవారం సత్కరించారు. విశాఖ నార్త్ ఏసీపీగా ఉన్న నరసింహమూర్తి ఇటీవల ద్వారక ఏసీపీగా బదిలీపై రావడంతో, ఆయన్ను కలిశారు. గతంలో ఎంవీపీ కాలనీలోని విజిలెన్స్ డిపార్ట్‌మెంట్ ఏసీపీగా, ద్వారకా జోన్‌లోని పలు స్టేషన్లలో సీఐగా ఆయన అందించిన సేవలను కొనియాడారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



బహుమతి అందుకుంటున్న విజేత జట్టు

ఎంవీపీకాలనీ: వెంకోజీపాలెం శ్రీ రాధాకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏఎస్ రాజా మైదానంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఇటీవల మరణించిన సంఘం సభ్యుడు పల్లా పైడిరాజు జ్ఞాపకార్థం మిత్రులంతా ఈ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో 6 జట్లు హోరాహోరీగా పోటీ పడగా పల్లా పైడిరాజు టీమ్ విజయం సాధించింది. సంఘం అధ్యక్షుడు ఒమ్మి ముత్యాలరాజు విజేత జట్టుకు బహుమతులు అందజేశారు.

వెటరన్ టెన్నిస్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న అతిథులు

విశాఖ స్పోర్ట్స్: వెటరన్ టెన్నిస్ పోటీలను ఆఫీసర్స్ క్లబ్ టెన్నిస్ కోర్టులో విశాఖ ఎంపీ శ్రీభరత్ సోమవారం ప్రారంభించారు. సింగిల్స్‌తో పాటు డబుల్స్ విభాగాల్లో మెన్‌కు 35 ఏళ్ల నుంచి 75 ఏళ్ల వయసు గల వారికి పలు కేటగిరిల్లో ఈ పోటీలు జరగనున్నాయి. ఆల్ ఇండియా సీనియర్ నేషనల్ టెన్నిస్ టోర్నీ పేరిట ఫిబ్రవరి 2వ తేదీ వరకు ఐదు కేటగిరిల్లో పోటీలు ఆఫీసర్స్ క్లబ్‌తో పాటు స్థానిక క్లబ్‌ల్లో పోటీలు నిర్వహించనున్నారు. పోటీల ప్రారంభం సందర్భంగా ఎంపీ భరత్ కాసేపు టెన్నిస్ ఆడారు. సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు పీవీఆర్ ప్రశాంత్, మాజీ డీజీపీ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

మెగా బైబిల్ ఎగ్జిబిషన్ కరపత్రిక ఆవిష్కరణ



కరపత్రిక, పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జాన్ విక్రమ్ తదితరులు

మద్దిలపాలెం: బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఫిబ్రవరిలో నిర్వహించనున్న మెగా బైబిల్ ఎగ్జిబిషన్ కం సేల్ కరపత్రిక, వాల్‌పోస్టర్, బ్యానర్‌లను బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఏపీ ఆగ్జిలరీ సెక్రటరీ జాన్ విక్రమ్ సోమవారం ఆవిష్కరించారు. రేసపువానిపాలెంలోని క్యూఎంబీ చర్చిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 14,15,16 తేదీల్లో ఉదయం 10గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రేసపువానిపాలెంలోని క్యూఎంబీ చర్చిలో ఈ ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎగ్జిబిషన్‌లో బైబిల్స్, క్రైస్తవ సాహిత్యంపై 10శాతం నుంచి 50శాతం వరకు (బల్క్ ఆర్డర్స్‌పై) డిస్కౌంట్స్ కూడా ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ 17వ వార్డులో రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శంకుస్థాపన చేశారు. 17వ వార్డు ఎంవీపీ కాలనీ సెక్టార్–5లో సోమవారం ఈ కార్యక్రమం జరిగింది. గిరిజన భవన్ కూడలి నుంచి సెక్టార్–4,5ల మీదుగా టీటీడీ నుంచి ఉద్యోగ వైపు వెళ్లే రోడ్డును కలుపుతూ రూ.40 లక్షల వ్యయంతో ఈ రోడ్డు నిర్మాణం జరగనుంది. చాలా కాలంగా ఈ రోడ్డు పాడైపోవడంతో స్థానికుల విజ్ఞప్తి మేరకు జీవీఎంసీ రహదారి నిర్మాణం చేపట్టింది. కార్యక్రమంలో ఏఈ అప్పలనాయుడు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చోరీ సొత్తు స్వాధీనం

ఎంవీపీకాలనీ: ఇటీవల ఎంవీపీ కాలనీలో జరిగిన ఓ దొంగతనం కేసులో చోరీ సొత్తును ఎంవీపీ నేర విభాగం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎంవీపీ క్రైం సీఐ చక్రధర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంవీపీ కాలనీ సెక్టార్–3లో నివాసం ఉంటున్న శామ్యూల్ అనిల్‌కుమార్ ఇంట్లో ఈ నెల 16వ తేదీన గుర్తు తెలియని వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. టీవీ, గ్యాస్ స్టవ్‌తో పాటు ఇతర వస్తువులు చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాల ద్వారా జోడుగుళ్లపాలెంకు చెందిన వాసుపల్లి నరసింగరావును నిందితుడిగా గుర్తించారు. విచారణలో రూ.61,700 విలువైన టీవీ, గ్యాస్ స్టవ్ దొంగిలించినట్లు నిందితుడు అంగీకరించడంతో, అతని నుంచి వాటిని స్వాధీనం చేసుకున్నారు.

తహసీల్దార్‌పై చర్యలకు వినతి

ఎంవీపీకాలనీ: సీతమ్మధార తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వెంకోజీపాలేనికి చెందిన తెలుగు శక్తి అధ్యక్షుడు బీవీ రామ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం వరిసాం గ్రామంలో 6 ఎకరాల 23 సెంట్లు స్థలం కాజేసేందుకు జరిగిన కుట్రలో సీతమ్మధార తహసీల్దార్ పాత్ర ఉందని పేర్కొన్నారు. ఫోర్జరీ సంతకాలతో కొందరు ఆ భూమిని కాజేసే ప్రయత్నం చేస్తున్నారని సతీ సావిత్రి అనే ఆమె జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆ విచారణలో తహసీల్దార్ రమేష్, ఆర్ఐ తప్పుడు నివేదికను తయారుచేసి ఆర్డీవోకు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపి, వారిపై చర్యలు తీసుకోవాలని జేసీని కోరారు.

కొనసాగుతున్న పశు వైద్య శిబిరాలు



మేకలకు వ్యాధి నిరోధక టీకా వేస్తున్న పశు వైద్య సిబ్బంది

ఆరిలోవ: చినగదిలి మండలంలో ఉచిత పశు వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. జిల్లా పశు సంవర్ధక శాఖ వారం రోజులగా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, పాడి రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా చినగదిలి మండలంలో శిబిరాలు కొనసాగుతున్నాయి. మండల పరిధి ఎండాడలో ఏడీ డాక్టర్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి జోడుగుళ్లపాలెం, ఎండాడ, సాగర్‌నగర్, గుడ్లవానిపాలెం, రుషికొండ తదితర ప్రాంతాల నుంచి పాడి పశువులు, ఆవులు, గేదెలు, మేకలు, కోళ్లను తీసుకువచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసరావు ఆ రైతులకు పశువుల పెంపకం, పాల ఉత్పత్తి, సీజనల్ వ్యాధులు, వ్యాధి నివారణ మందుల వాడకం, పశు బీమా పథకం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మేకలు, దూడలకు నట్టల నివారణ మందులు, వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఇందులో భాగంగా పాడి రైతులకు నట్టల నివారణ మందులు, ఏలిక పాముల నివారణ మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ 31 పశువులకు చికిత్స, 11 పశువులకు గర్భకోశ పరీక్షలు, 513 పశువులు, మేకలకు నట్టల నివారణ మందులు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎనిమిదో వార్డు కార్పొరేటర్ ఎస్.అప్పారావు, పశు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కేకేఆర్ గౌతమ్ స్కూల్ వార్షికోత్సవం



సాంస్కృతిక ప్రదర్శనతో అలరిస్తున్న విద్యార్థులు

ఎంవీపీకాలనీ: లాసన్స్ బే కాలనీలోని కేకేఆర్ గౌతమ్ స్కూల్ 17వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీదేవి, కేకేఆర్ గౌతమ్ విద్యాసంస్థల విశాఖ జోన్ డీన్ కె.శేషుబాబు అతిథులుగా పాల్గొన్నారు.

ఉన్నత విలువలతో పాటు విద్యార్థులకు అత్యుత్తమ విద్యాప్రమాణాలు అందించడమే లక్ష్యంగా కేకేఆర్ గౌతమ్ విద్యాసంస్థలను ముందుకు నడిపిస్తున్న సంస్థ చైర్మన్ డాక్టర్ కె.కోటేశ్వరరావు సేవలను కొనియాడారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ దుర్గ, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఓపెన్ బార్

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో 24 గంటలు మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలోని బార్లలో సమయం పాటించకుండా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. పలు బార్లు షెట్టర్లు మూసేసి కిటికీల నుంచి అనధికారికంగా మద్యం విక్రయిస్తున్నారు. నిజానికి బార్ల లోపల మద్యం తాగుతారు. ఇక్కడ మాత్రం బహిరంగంగా మద్యం తాగుతూ, రోడ్డుపై హల్‌చల్ చేస్తున్నారు. బార్లకు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఎక్సైజ్ శాఖ అనుమతి ఇచ్చింది. ఆ నిబంధనలను కూడా బార్ల యజమాన్లు పక్కన పెడుతున్నారు. అయినా అధికారులు వాటి జోలికి వెళ్లకపోవడంపై స్థానికుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.

రోడ్డుపైనే మద్యం సేవిస్తూ..

ఆరిలోవ కాలనీ ఆఖరి బస్‌స్టాప్ వద్ద సరిగమ రెస్టారెంట్ అండ్ బార్‌లో 24 గంటలు మద్యం విక్రయిస్తున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారుల నిబంధనల ప్రకారం ఉదయం 11 నుంచి రాత్రి 11 గంటల వరకు బార్ తెరిచి మద్యం విక్రయిస్తుండగా.. మిగిలిన సమయాల్లో దొడ్డిదారిన షెట్టర్లు మూసేసి కిటీకీలు, గజాల లోపల నుంచి మద్యం విక్రయించేస్తున్నారు. ఇక్కడ మందుబాబులు మద్యంలో కలుపుకోవడానికి మంచి నీటితో క్యాన్లు, ఖాళీ మద్యం బాటిళ్లు, డిస్పోజబుల్ గ్లాసులు వేయడానికి పక్కనే డస్ట్‌బిన్‌లు కూడా ఏర్పాటు చేశారు. దీంతో తెల్లవారేసరికే మందు బాబులు ఇక్కడ సిద్ధమైపోతున్నారు. ఆ బార్ ముందే రోడ్డుపై మందుబాబులు పూటుగా మద్యం తాగుతున్నారు. తాగిన మైకంలో కొందరు రోడ్డుపై చిందులేస్తున్నారు. కూతవేటు దూరంలోనే విశాలాక్షినగర్‌లో ఎక్సైజ్ శాఖ ప్రధాన కార్యాలయం ఉన్నా అధికారులెవ్వరూ ఈ ప్రాంతంలో బార్ల వైపు కన్నెత్తి కూడా చూడకపోవడం విశేషం. వారి కనుసన్నలలోనే బార్ అండ్ రెస్టారెంట్లలో 24 గంటలు మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో పాటు బహిరంగంగా మద్యం సేవిస్తున్నా ఆరిలోవ పోలీసులు కనీస చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.



ఆరిలోవ కాలనీలో బార్ వద్ద సోమవారం ఉదయం 6 గంటలకు మద్యం తాగుతున్న మందుబాబులు

కారాగారంలో కాలీఫ్లవర్



జైల్ ఆవరణలో కాలీఫ్లవర్స్ కోస్తున్న ఓపెన్ ఎయిర్ ఖైదీలు



కారాగారంలో కోసిన కాలీఫ్లవర్లు

ఆరిలోవ : విశాఖ కేంద్ర కారాగారంలోని వ్యవసాయ క్షేత్రంలో వేసిన కాలీఫ్లవర్ పంట చేతికి వచ్చింది. ఇక్కడి ఓపెన్ ఎయిర్ ఖైదీలు వ్యవసాయం చేస్తున్న విషయం తెలిసిందే. వీరితో జైలు అధికారులు ఆ వ్యవసాయ క్షేత్రంలోని కొన్ని కాలీఫ్లవర్స్‌ను కోయించారు. వాటిని ఖైదీల భోజనానికి ఉపయోగించారు. మిగిలిన వాటిని జైలు ప్రధాన ద్వారం వద్ద నిర్వహిస్తున్న సుధార్ కేంద్రంలో విక్రయానికి ఉంచనున్నారు. ఇవి ఒకటిన్నర కిలోల నుంచి రెండు కిలోల బరువులో ఉన్నాయి. పూర్తి సేంద్రియ పద్ధతిలో వీటిని సాగు చేశారు. ఇక్కడ కాయగూరలు రుచికరంగా ఉండటంతో బయట వ్యక్తుల నుంచి మంచి గిరాకీ ఉంది.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా వీవోఏల దీక్షలు



జీవీఎంసీ పార్కులో రిలే దీక్ష చేస్తున్న ఏపీ వెలుగు వీవోఏ ఉద్యోగుల సంఘం

సీతమ్మధార : కూటమి అధికారంలోకి వచ్చాక వీవోఏల సమస్యలు పరిష్కరించడంలో తీవ్ర అలసత్వం వహిస్తోందని ఏపీ వెలుగు వీవోఏ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం, సీఐటీయూ రాష్ట్ర కమిటీ నేతలు పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మూడు రోజులు రిలే దీక్షలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా తొలిరోజు సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన దీక్షలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా జీతం ఇవ్వాల్సిన కనీస బాధ్యతను ప్రభుత్వం విస్మరించడం దారుణమన్నారు. ఆరు నెలలుగా జీతాలు ఇవ్వకపోతే వీవోఏలు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని కోరారు. అక్రమంగా తొలగించిన వీవోఏలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయకపోవడం కోర్టు ధిక్కారమేనని పేర్కొన్నారు. ప్రతి మండలం నుంచి ఐదుగురు ముఖ్యమైన నాయకులు దీక్షలో కూర్చున్నారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షురాలు పి.మణి, యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు అపర్ణ, కుంచమ్మ , కోశాధికారి శ్రీలక్ష్మి, యూనియన్ ముఖ్య నాయకులు వెంకటలక్ష్మి, పార్వతి, శారద తదితరులు దీక్షలకు నాయకత్వం వహించారు.

జనసంద్రమైన తాజుద్దీన్‌బాబా ఆశ్రమం



దర్బారులో భక్తుల దువా



చందల్‌కు ఎదురెళ్లి స్వాగతం పలుకుతున్న ఆశ్రమ వ్యవస్థాపకుడు తాజి రెడ్డిబాబా

తగరపువలస: భగవాన్ తాజుద్దీన్‌బాబా 164వ జయంతిలో భాగంగా సోమవారం భీమిలి మండలం దాకమర్రి పంచాయతీ నీలయమ్మసత్రం కూడలిలోని బాబా ఆశ్రమ కూడలి భక్తులతో జనసంద్రంగా మారింది. వేలాది మంది భక్తులకు ఆశ్రమ నిర్వాహకులు ఆదివారం నుంచి మూడు రోజుల పాటు అన్నప్రసాదాలు పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాలు, ఉత్తరాదిలోని నాగ్‌పూర్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, ఒడిశాకు చెందిన వేలాది మంది భక్తులు కులమతాలకు అతీతంగా బాబాకు మేళతాళాలు, బాణసంచా, నేలవేషాలు, కోలాటం, పులివేషాలు, తీన్‌మార్‌తో చందల్, చాదర్, గులాబీలు, అత్తరు తీసుకువచ్చి దర్బారులో దువా అర్పించారు. బాబా చిత్రపటాన్ని ప్రత్యేక రథంపై ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ప్రధానంగా విజయనగరానికి చెందిన రొబ్బి హేమకుమార్, నాగ్‌పూర్‌కు చెందిన మహమ్మద్ షార్ఫుద్దీన్ తాజి, ఛత్తీస్‌గఢ్ డోంగర్‌గడ్‌కు చెందిన ఖాదర్‌వలీబాబా ఆశ్రమ నిర్వాహకులు సమర్పించిన చాదర్‌లు ఘనంగా నిలిచాయి. వీటికి ఆశ్రమ వ్యవస్థాపకుడు తాజి రెడ్డిబాబా ఎదురుగా వెళ్లి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా పలువురు ఆయన నుంచి ఆశీర్వచనాలు తీసుకున్నారు. ఆశ్రమం ఆవరణలో ఖవ్వాలీ ప్రదర్శించారు. జయంతి వేడుకలకు వచ్చిన భక్తులు దర్బారుతో పాటు బాబా ధ్వజానికి పూజలు చేసి దునిలో సుగంధ ద్రవ్యాలు సమర్పించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఆశ్రమం నుంచి జాతీయరహదారి వరకు మార్గాలలో తీర్థం నిర్వహించారు. వివిధ వస్తువులు రూ.5 నుంచే లభించడంతో పాటు విలువైన వస్త్రాలు, అత్తరు లభించాయి. పలువురు భక్తులకు బాబా క్యాలెండర్లు పంపిణీ చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా భీమిలి లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆశ్రమ ట్రస్టీలు డి.రాజు కుమందన్, మహమ్మద్ అస్లాం, మహమ్మద్ సాహెబ్, వి.త్రిమూర్తి భక్తులకు భోజన, వసతి సదుపాయాలు సమకూర్చారు.

మంచుదుప్పటి



నగరం, పరిసర ప్రాంతాలను సోమవారం పొగమంచు కప్పేసింది. తెల్లవారు జాము నుంచి ఉదయం 8 గంటల వరకూ మంచు కురిసింది. పనులపై రోడ్లపైకి వచ్చినవారు ఇబ్బందిపడ్డారు. వాహన చోదకులు ఉదయం 8 గంటల వరకూ బీఆర్‌టీఎస్ రోడ్డులో లైట్లు వేసుకుని నడపాల్సి వచ్చింది. – ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ శశిభూషణరావు

విశాఖ విద్య: ఏక్ భారత్–శ్రేష్ఠ భారత్ కార్యక్రమంలో భాగంగా ఫిబ్రవరి 5 నుంచి 11వ తేదీ వరకు పంజాబ్‌లోని చండీఘర్ విశ్వవిద్యాలయంలో జరగనున్న జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొనున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లను ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా ఆయా రాష్ట్రాల సంస్కృతి సంప్రదాయాలను తెలుసుకునే వీలుంటుందన్నారు. జాతీయ సమైక్యతా భావాన్ని పెంపొందించేందుకు ఇవి దోహదపడతాయన్నారు. వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కేంద్రం కో–ఆర్డినేటర్ ఆచార్య ఎస్.హరనాథ్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్‌తో పంజాబ్ రాష్ట్రాన్ని జతపరిచారన్నారు. మన వలంటీర్లు పంజాబ్ వెళ్తారని, అదేవిధంగా పంజాబ్ నుంచి అక్కడి ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు మన రాష్ట్రంలో జరిగే జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొంటారని తెలియజేశారు.